# ప్రవేశిక

**భా**రతదేశం ప్రధానంగా వ్యావసాయిక దేశం. మన దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోల్చినపుడు వ్యవసాయ రంగంలో ప్రత్యేక ప్రాముఖ్యం పొందినది మన ఆంధ్రప్రదేశ్. భౌగోళికంగా మన రాష్ట్రాన్ని కోస్తా, తెలంగాణా, రాయలసీమ అనే మూడు భాగాలుగా విభజించుకున్నాం. వీటిలో ప్రత్యేక భౌగోళిక స్థితిగతులు కలిగిన ప్రాంతం రాయలసీమ. అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలను కలిపి రాయలసీమ అని పిలుచుకుంటున్నాం.

ఇతర ప్రాంతాలతో పోలిస్తే రాయలసీమను రాళ్ళసీమ అని వ్యవహరించవచ్చు. ఎక్కువగా కొండలు, గుట్టలు, మెట్టలు కలిగిన రాయలసీమ అతిగా అనావృష్టికి గురి అవుతున్న ప్రాంతం. పేరుకు పెన్న వంటి నదులు రాయలసీమలో ఉన్నప్పటికీ అవి సంవత్సరంలో ఎక్కువ కాలం వర్షాలు లేక ఇసుక దిబ్బలు మేట వేసుకొని పోయి ఉంటాయి. అందువల్ల రాయలసీమ రైతులు ఎక్కువగా వర్షాధార పంటలు మీద కాక మెరక పంటల మీద ఆధారపడి జీవిస్తున్నారు.

ఇటీవల కొన్ని సంవత్సరాలుగా వర్షాలు తగిన రీతిలో కురవక పోవడం వల్ల రాయలసీమ రైతులు కరవు కాటకాలతో అలమటించి పోతున్నారు. కరవు తీవ్రత వల్ల రాయలసీమలోని అన్ని జిల్లాల నుండి కొంతమంది రైతులు వలసలు పోయి ఇతర ప్రాంతాలలో కూలీ నాలీ చేసుకొని జీవనం గడుపుతున్నారు. మరికొందరు రైతులు ఇల్లు విడిచి వెళ్ళలేక అర్ధాకలితో జీవనం గడుపుతున్నారు. వీరిలో కొందరు వ్యవసాయం కోసం అప్పులు చేసి, అవి తీర్చలేక ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలు కూడా ఇటీవల కాలంలో ఎక్కువగానే ఉన్నాయి. కొందరు ఉన్న భూములను తెగనమ్ముకొని, మరికొందరు పశువులను కసాయి కొట్లకు అమ్ముకొని బతుకులీడుస్తున్నారు.

ప్రపంచీకరణ పరిస్థితులవల్ల, ఫ్యాక్షన్ రాజకీయాల వల్ల పరిపాలనా వ్యవస్థలోని కొన్ని లొసుగుల వల్ల, సహజంగానే రాయలసీమ వాసుల్లో ఉన్న కొన్ని మూఢ విశ్వాసాల మూలంగా సీమవాసుల జీవన పరిస్థితులు రోజు రోజుకూ క్షీణించి పోతున్నాయి. ఇవి కొన్ని సంవత్సరాలుగా సజీవంగా ఉన్న రాయలసీమ స్థితిగతులు.

భౌగోళికంగా ఉన్న ఈ దయనీయ పరిస్థితులు రాయలసీమ సంస్కృతిలోనూ కొన్ని దశాబ్దాలుగా ప్రభావం చూపుతున్నాయి. అన్ని రంగాలలోనూ వెనుకబడి ఉన్న రాయలసీమ సాహిత్య రంగంలోనూ ఆలస్యంగానే ఆధునిక యుగంలోకి అడుగుపెట్టింది. ఆంధ్రప్రదేశ్ లోని ఇతర ప్రాంతాలలో అభ్యుదయ సాహిత్యం ఉద్యమ స్థాయినందుకున్న కాలంలో కూడా రాయలసీమలో సంప్రదాయ వాతావరణంలోనే పద్యకావ్యాలు వెలువడటం ఈ పరిస్థితికి అద్దం పడుతుంది. ఇందులో భాగంగానే రాయలసీమ రచయితలు కథా ప్రక్రియను స్వీకరించడానికి కొంతకాలం పట్టింది. అయితే రాయలసీమలో కథానిక ప్రక్రియ ఆవిర్భవించిన తరువాత ఒక ఉద్యమ స్థాయిలోనే కథలు ఇక్కడ నుండి వెలువడ్డాయి. అనేకమంది రచయితలు వందల సంఖ్యలో రచించిన కథలలో రాయలసీమ వాసుల జీవన స్థితిగతులను సజీవంగా చిత్రించారు. పైన ప్రస్తావించుకున్న రాయలసీమ దుస్థితులన్నింటినీ కథా వస్తువులుగా స్వీకరించి తెలుగు కథకు దిశానిర్దేశం చేశారని కూడా చెప్పుకోవచ్చు. ఇది కొన్ని సంవత్సరాలుగా రాయలసీమలో ఉన్న కథాసాహిత్యం పరిస్థితి.

నేను రాయలసీమలో పుట్టి పెరగడం వల్ల సీమ కథకులు చిత్రించిన కథలను అందులోని వాస్తవిక పరిస్థితులను కొద్ది సంవత్సరాలుగా గమనించ గలుగుతున్నాను. స్నాతకోత్తరస్థాయిలో తెలుగు సాహిత్యాన్ని అధ్యయనం చేసిన తరువాత శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసే సదవకాశం కలిగింది. అందువల్ల నేను మొదటి నుంచీ అభిమానిస్తూ ఉన్న కథానిక

సాహిత్య ప్రక్రియపై పరిశోధన చేయాలని నిర్ణయించుకున్నాను. ఇందులో భాగంగానే "రాయలసీమ కథలు - క్షామ చిత్రణ" అనే అంశాన్ని నా పరిశోధనకు నిర్ణయించుకున్నాను. నేను అభిమానించే కథానికా సాహిత్య ప్రక్రియపై గానీ, నేను పుట్టి పెరిగిన రాయలసీమ గడ్డపైగానీ ఏ విధమైన రాగద్వేషాలు ప్రదర్శించకుండా పరిశోధనా దృష్టితోనే నా సిద్ధాంతవ్యాసాన్ని రూపొందించాను.

ఈ సిద్ధాంత వ్యాసాన్ని రూపొందించడానికి అనేకమంది సీమకథకుల అసంఖ్యాక కథలే కాక; ఇతరేతర విమర్శ గ్రంథాలు, చరిత్రలూ, విజ్ఞాన సర్వస్వాలు, విశేష సంచికలూ, వివిధ వ్యాసాలు. ఎంతగానో ఉపకరించాయి.

ఈ సిద్ధాంత వ్యాసాన్ని వ్యావహారిక భాషలో రచించాను. అందువల్ల అరసున్నాలు, శకటరేఫలు వంటి సంప్రదాయ, గ్రాంథిక భాషా మర్యాదలను పాటించలేదు. కొన్నిచోట్ల సంధి దోషాలు, సమాస దోషాలు కూడా దొర్లి ఉండవచ్చు. ఈ సిద్ధాంత వ్యాసాన్ని ఎంత సవిస్తరంగా రూపొందించినప్పటికీ చెప్పవలసిన అంశాలు నా దృష్టికి రాకుండా ఇంకా కొన్ని మిగిలే ఉండవచ్చు. అటువంటివి ఏమైనా ఉంటే పరిశీలకులు నా దృష్టికి తీసుకొని రావలసినదిగా కోరుతున్నాను. సహేతుకమైన వాటినన్నింటినీ నేను సవరించుకోడానికి సంసిద్ధంగా ఉన్నానని సవినయంగా మనవి చేసుకుంటున్నాను.

**(యం.వి. నాగ సుధారాణి)**

*పరిశోధకురాలు.*